కథానిక :

# వర్షించని మేఘాలు

"శాంతశ్రీ"

"అబ్బాయిని చూడటానికి నిన్నాళ్లనుంచీ తీర నే లేదు కాబోలు." అంది సుగుణ కళ్లచివర ల్లోంచి రామచంద్రమూర్తివైపు చూస్తూ.

"ఊఁ" అన్నాడు అతను ముభావంగా, చేతు ల్లోని పేపరు పేజీ తిప్పుతూ.

"నిజంగా నే తీర లేదా ?"

"లేదన్నానుగా," పొడిగా, విసుగ్గా అన్నాడు మూర్తి.

"తీరటం, తీరకపోవటం మీ చేతుల్లో పనేగా. అంత తీరకపోవటానికి మీరు చేసే రాచకార్యా లేమున్నాయి ?

"ఇల్లు కట్టిస్తున్నాను."

"ఇల్లా?"

"అవును."

"ఎందుకు ? ఇప్పుడున్న ఇల్లేం చేస్తారు?"

"అదీ ఉంటుంది."

సుగుణ అర్థంకాని చూపులతో అతనివైపు చూసింది.

"రెండిళ్లెందుకు ?"

మూర్తి మాట్లాడలేదు.

"అద్దె కిస్తారా ?"

"ఏదో చేస్తా న్లెద్దూ ? నీ కెందుకా గొడవ?" విసుక్కున్నాడు మూర్తి.

సుగుణమనసు కొంచెం చివుక్కుమంది. భర్త గొడవలు భార్యకి కాకపోతే మరెవరికి కావాలి ? అయితే, మూర్తి ఇలా విసుక్కోటం ఇది మొదటి సారి కాదు ; ఎన్నోసారో చెప్పటం తేలిక కాదు. కారణంకూడా సుగుణకి తెలుసు. ఇంతవరకూ వికాసంతో ఉన్న ఆమెముఖం వాడిపోయింది.

"మనోరమకా?"

మూర్తి ముఖం చిట్లించుకున్నాడు.

"అంతేనా ?"

కోపంలో పేజీ తిప్పబోయి దాన్ని చింపాడు మూర్తి.

"ఎవరికయితే నా కెందుకు లెండి!" అంది సుగుణ విషాదంగా.

"అలా అని ఊరుకోరాదూ, ఊరికే నన్ను చంపకపోతే!" పేపరు మడిచి బల్లమీద పారేస్తూ కసురుకున్నాడు మూర్తి. సుగుణకళ్లు చెమ్మగిల్లాయి. భర్త ముందు ఆమెకళ్లు చెమ్మగిల్లటం, ఆమె కాపరానికి వెళ్లిన రెండేళ్లలో ఇది ఎన్నోసారో ! అతని హృదయంలో ఆమె కన్నీళ్లకి విలువ లేదు. లేదని ఆమెకి కూడా తెలుసు. తెలిసినందువల్లే ఆమెకళ్లు మరింతగా చెమ్మగిల్లటం, తరవాత వాటంతట అవి ఆరిపోవటం. పక్కకి తిరిగి, కన్నీళ్లని తుడుచుకుంటూ అందామె, విషయం మారుస్తూ.

"అబ్బాయిని చూశారా ?"

"ఊఁ"

"ఎవరి పోలిక?"

"ఏమో"

"అంతా, మీ పోలికే నంటున్నారు."

"ఊఁ హూఁ"

"ఆ కళ్లూ ముక్కూ అంతా మీపోలికే."

పాపాయివైపు చూశాడు మూర్తి. ఆ చూపుని చూసి సుగుణ మురిసిపోయింది. సంతోషంలో పొరపాటున ఓ బాణుకు విసిరింది. తన స్వభావాని కనుగుణంగా.

"రూపులో మీపోలి కొచ్చినా, బుద్ధిలో నైనా రాకుండా ఉంటే బావుండును."

"నీకు నేనంటే అంత అసహ్యమన్నమాట." కోపంతో మూర్తి మొఖం ఎర్రబడ్డది.

సుగుణకి గుండె గతుక్కుమంది. క్షమాపణ కోరుకుంటున్నట్టుగా అంది, వొణికే కంఠంతో.

"తమాషాగా అన్నానండీ."

"తమాషా! నేను మొదట్నించీ చూస్తూనే ఉన్నాను. వెధవ ఎత్తిపొడుపులు. నా ఇష్టంవొచ్చినట్టు నేను తిరుగుతాను. నువ్వెవరివి అడగటానికి?"

"ఇంకెప్పుడూ అనను. పొరపాటున నోరు జారి..."

"నోరుజారిందేం? అయితే అనుభవించు. కాలు జారినా తీసుకోవచ్చుగాని నోరుజారితే ఇహ అంతే—" చివాలున లేచాడు కూర్చున్న కుర్చీలోంచి మూర్తి. ఈ ఆకస్మిక పరిణామానికి స్తంభీభూతురాలైంది సుగుణ.

"మీ కంత కోపం వస్తుం దనుకోలేదు. లేకపోతే, అనేదాన్ని కాను."

ఆమె మాటలు వినిపించుకోకుండా విసురుగా వెడుతూన్న అతని దారికి అడ్డంగా వొచ్చి అతని కండువా పట్టుకుని బతిమాలే స్వరంతో అంది సుగుణ.

"మీ రిలా వెళ్లిపోతే అంతా ఏమనుకుంటారు? ఇవాళ బారసాలగదా! నలుగురిలో ఎంత తలవంపులుగా ఉంటుంది! ఇం కెప్పుడూ అనను. ఈసారికి మన్నించండి."

కోపమూ, అహంకారమూ పగ్గాలేని ముందుకి లాగటంవల్ల, మూర్తి అడ్డువొచ్చిన సుగుణని తోసుకుని ముందుకి వెళ్ళిపోయాడు. నోటిని ఇష్టంవొచ్చినట్టు పారేసుకొంటూ.

అతను వెళ్లిపోయినదారివైపు శూన్యంగా చూసింది సుగుణ. పెళ్లి కాకముందు ఇటువంటి దృశ్యం ఆమెకి కలలోకూడా కనపడలేదు. క్లాసు పుస్తకాలకంటే ఎక్కువగా నేటి తెలుగుపత్రికలని తృణ్ణంగా చదివిన సుగుణకి, మబ్బులలో మబ్బులుగా కలిసిపోతున్నట్టు ఆకాశంలో సంచరించే ప్రేయసీ, ప్రియుల చిత్రాలు కాక నేలమీద నడిచే కొందరి భార్యాభర్తల యథార్థ జీవితదృశ్యాల్లో ఒకటికూడా ఎప్పుడూ కనిపించకపోవటంలో ఆశ్చర్యం లేదు. ఒకానొక ప్రేమైక హృదయాన్ని నిండు ప్రేమతో పరిపాలించాలనే ఆమె వాంఛ నిర్దయగా ఇలా తోసివేయబడుతుందని, కనీసం అలా తోసివేయబడటానికి అవకాశం లేకపోలేదని, ఆమె ఎప్పుడూ ఊహించుకోలేదు. చనువుగా, ప్రేమగా ఒక్కమాట మాట్లాడడానికికూడా ఆమె భర్తదగ్గిర ఆమెకి అధికారంలేదు.

"ఎందుకీ జీవితం?" నిట్టూర్చింది సుగుణ.

"ఆతన్ని స్నానం చెయ్యమనమ్మా. బ్రాహ్మణులంతా వొచ్చి కూర్చున్నారు. ఇప్పటికే ఆలస్యమైపోయింది."

ఎవర్ని స్నానం చెయ్యమనటం! సుగుణకి దుఃఖం పొంగి పొర్లింది.

జగన్నాథంపంతులు గదిలోకి వొస్తూ అంటున్నాడు.

"ఏమోయ్, స్నానం కానీ—" గదిలోకి వచ్చి, అల్లుడు కనబడకపోయేసరికి అడిగాడు ఆయన ఆశ్చర్యంతో.

"ఇప్పు డెక్కడికి కెళ్ళాడమ్మా ఇతను?" సుగుణ ఏమీ సమాధానం చెప్పలేదు.

"హోటలు కెళ్లాడా ఏం?"

"ఇంటికి."

ఆశ్చర్యంతో చూశాడు జగన్నాథంగారు కూతురువైపు.

"ఇంటికా?"

"అవును." క్లుప్తంగా చెప్పింది సుగుణ, అబద్ధం.

"ఇప్పు డింటికి వెళ్లట మేమిటి?"

కాసేపాగి సుగుణ అంది, నెమ్మదిగా.

"ఇవాళ బారసాల జరగదు నాన్నా. వారికేదో అర్జంటుపని ఉందిట. వెళ్ళిపోయారు". నిజం చెప్పటానికి సిగ్గుపడ్డది సుగుణ.

"అర్జంటుపనా!"-జగన్నాథంపంతులు కూతురు ముఖంవైపు చూశాడు. దైన్యం, నైరాశ్యం తాండవించే ఆ ముఖం చూసి,లోకంతీరు తెలుసుకోటంలో తలనెరసిన జగన్నాథంగారు అసలుసంగతి పసికట్టాడు. ఒక నిమిషం ఆగి—

"ఏమైనా అన్నావా అమ్మా?" అన్నాడు ఆయన. సుగుణ కాలి బొటనవేలుతో నేల రాస్తూ నుంచుంది. సమాధానం ఏమీ చెప్పలేదు.

"అంత మూర్ఖుడనుకోలేదమ్మా మూర్తి."

సుగుణ కళ్లవెంబడి అశ్రువులు రాలాయి.

"అలిగిపోటానికి చిన్నవాడా, చితకవాడా? ఒక వేళ మాట అంటే మాత్రం తను పడదగినవాడు

కాదా ? యుక్తాయుక్త విచక్షణజ్ఞానం లేకుండా ఇలా మధ్యలో వెళ్ళిపోయి అవమానిస్తాడా ? వంకర బుద్ధులు. ఆ వంశంలో ఎవరికీ ఇటువంటి నడతలు లేవు. బుద్ధిమంతు డనుకున్నాను గాని..." ఉద్రేకంలో ఇష్టంవొచ్చినట్టు మాట్లాడసాగాడు జగన్నాథంపంతులు.

"ఎందుకు నాన్నా, అనవసరంగా అనుకోటం...." అంది సుగుణ విచారంగా.

"ప్చ్, అంతేలే అమ్మా" అన్నాడు నెత్తిమీద చెయ్యిపెట్టుకొని జగన్నాథం.

సుగుణ పాపాయి మంచంమీద కూర్చుని వాడి తల నిమిరింది. మనసులో ఏముందో గాని, వాడు తల్లివైపు కళ్ళార్పకుండా చూపి వేదాంతిలా చిరునవ్వు నవ్వాడు. సుగుణకూడా నవ్వింది—పాపాయి కోసం. అప్పుడే కాదు—తరవాతకూడా సుగుణ నవ్వుతూనే ఉంది-పాపాయికోసం, ప్రతిరోజూ. రోజులు ఆమెని జాలిగా చూస్తూ జారిపోతున్నాయి.

"ఎన్నాళ్ళిలా?" రోజూ సుగుణ ప్రశ్నించుకుంటూనే ఉంది.

"ఎన్నాళ్ళిలా?" అని జగన్నాథంపంతులు కూడా చింతాస్వాంతుడు కాని రోజు లేదు.

జవాబులేని ఈ ప్రశ్నతో ప్రాణం విసిగి ఓ రోజు సుగుణ అంది.

"నేను వెడతాను, నాన్నా."

"నీ ఉత్తరాలకి ఒక్కదానికి కూడా అతను జవాబు రాయలేదు కదూ ?"

సుగుణ తలవొంచుకుని "ప్చ్" అంది, తనకేం వినబడనట్టుగా.

"నువు వెళ్ళిమాత్రం ఏం లాభం?"

"ఎన్నాళ్ళిలా?"

"ఆ మనోరమమీద భ్రాంతి ఉన్నంతకాలం అతనికి మంచీ, చెడూ తెలియదమ్మా."

కాసేపు నిశ్శబ్దంగా ఉండి, సుగుణ ఏదో నిశ్చయించుకొన్నదానిలా అంది దృఢంగా.

"వెడతాను. మన పాలేరుని బండికట్టమను నాన్నా!" జగన్నాథంపంతులు కూతురి ముఖంలోకి చూసి మరేమీ మాట్లాడకుండా వెళ్లిపోయాడు అక్కణ్ణించి.

కాసేపటిలో బండి వొచ్చింది. సుగుణ పాపాయితో సహా ఒక్కర్తే బయలుదేరింది. తండ్రిని రావొద్దంది. తను వెళ్లేచోట ఎటువంటి అవమానం ఎదురౌతుందో, తన అవమానాన్ని చూసి ఆయన ఎంత బాధపడతాడోనని ఒంటరిగా వెళ్లటానికే సిద్ధపడ్డది సుగుణ. పల్లెటూరు దాటి, ముప్పయి ని మిషాలయినా కాకుండానే మూడున్నరమైళ్ళు దాటి పట్నం చేరింది బండి. దడదడ కొట్టుకునే గుండెతో బండి దిగి జంకుతూ తలుపు నెట్టింది సుగుణ. లోపల సోఫాలో ఎవరో యువకుడు కూచునిఉన్నాడు.

సుగుణని చూసి అతను ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసిఅన్నాడు.

"ఎవరికోసమండీ?"

సుగుణకి ఒక్కసారిగా ముచ్చెమటలు పోశాయి.

"ఈ ఇల్లు అద్దె కిచ్చారేమో," అనే ఆలోచన తట్టిం దామెకి అకస్మాత్తుగా, తడబడుతూ అంది.

"మి...మీరు...ఈ ఇంట్లో అద్దెకున్నారా."

ఆ యువకుడు సుగుణవైపు ఒక్క క్షణం పరకాయించి చూసి, "లే"దన్నట్టు నెమ్మదిగా తల తిప్పాడు. సుగుణ కిదంతా అయోమయంగా ఉంది. "ఎవరో స్నేహితుడు కాబోలు"నని సమాధానపరచుకొని అడిగింది.

"రామచంద్రమూర్తిగారు..." తరవా తేమనాలో స్ఫురించక ఆగింది సుగుణ.

ఆ యువకు డేదో జ్ఞాపకం తెచ్చుకున్నట్టు "ఓహ్---మీరు...ఆయన తాలూకా ?వారి..."

"అవును" అంది సుగుణ అతనిఉద్దేశం గ్రహించి. అత డామెవైపు ఎగాదిగా చూసి ."మీరేనా?" అన్నాడు. ఆ అనటంలోని ఎగతాళి సుగుణకి స్పష్టంగా అర్థమయింది.

"కూచోండి, లోపలికి రండి. మూర్తిగారు బయటికి...అరె, మాటల్లోనే వొచ్చేశారే మూర్తిగారు...." సుగుణ తలఎత్తి వాకిలివైపు చూసింది. మూర్తి అదే సమయంలో సుగుణవైపు చూశాడు.

బయటినించి వొస్తూ. సుగుణ కళ్లు పక్కకి తిప్పుకుంది. మూర్తి ఆమెవైపు నఖశిఖపర్యంతం ఒక్కసారి తీక్ష్ణంగా చూశాడు. సుగుణ ఏదో చెప్పాలనుకుంది. బండీలో ఏమేమో ఆలోచించుకొంది. కాని అవన్నీ మర్చిపోయింది. అకస్మాత్తుగా.

"ఇవాళ ఇంత ఆలస్యంగా వొచ్చారేం, మూర్తి గారూ? మా మనోరమ ఇందాకటినించీ మీ కోసం కనిపెట్టుకు కూర్చుంది. త్వరగా వెళ్లి భోం చెయ్యండి."

"ఆ ఇల్లు కట్టించే ఉత్సాహంలో ఈ ఇంటి సంగతి మర్చిపోయినట్టున్నారు."

మెట్లమీదనించి వినవొచ్చిన ఈ సన్నని గొంతు విని సుగుణ తలెత్తి చూసింది. ఓ అందమైన యువతి కనబడ్డది.

"పనివాళ్లు వెళ్లటం ఆలస్యమయింది రమా." అన్నాడు మూర్తి ఒక్క క్షణం సుగుణ సంగతంతా మర్చిపోయి.

"ఈవిడే కాబోలు మనోరమ." అనుకుంది సుగుణ. మెట్లు దిగివొచ్చిన మనోరమ సుగుణని అత్తాత్తుగా చూసి తెల్లబోయింది; మూర్తివైపు ప్రశ్నార్థకంగా చూసింది. మూర్తి ముఖం చిట్లించుకున్నాడు

"ఎవరు" అంది మనోరమ.

రామచంద్రమూర్తి మాట్లాడలేదు.

"మన మూర్తిగారి భార్య".

మనోరమ మూర్తివైపు ఒకసారి తీక్ష్ణంగా చూసి చివాలున మెట్లవైపు పరిగెత్తింది. మూర్తి ఆమెని అనుసరించటానికి అడుగు ముందుకు వేశాడు.

"చూడండి" హీనస్వరంతో అంది సుగుణ.

మూర్తి తల వెనక్కి తిప్పి సుగుణవైపు చూసీ చూడనట్టు చూశాడు.

"నేను వొచ్చాను." అంతకంటె ఏమనాలో ఆమెకి తోచలేదు.

"చూశాను."

సుగుణ అవమానంతో తల దించుకుంది. తను ఏంచేసిందని ఇంత అవమానం చెయ్యటం! ఆమె కడుపులో మంట పుట్టింది. అతనివైపు సూటిగా, తీక్ష్ణంగా చూస్తూ అంది.

"ఉండటం మీ కయిష్టంకాకపోతే ఉంటాను." ఈ మాటలు అని సుగుణ చాలా సిగ్గుపడ్డది. ఆమె ముఖం ఎర్రబడ్డది. తను ఎంత తక్కువకిదిగజారాలో అంతవరకూ జారింది.

"ఆత్మాభిమానం కల వాళ్లెవరైనా ఆ మాటలనగలరా?" అని కించపడ్డది ఆమె.

"నీ ఇష్టం." అన్నాడు రామచంద్రమూర్తి.

ఈ మాటతో సుగుణలో గల అభిమానం పూర్తిగా దెబ్బతింది. తను అహం ఎంత చంపుకుని, ప్రయత్నపూర్వకంగా సహనం చూపిస్తోందో అతను అంతగా తనని అవమానిస్తున్నాడు. అందులో పరాయిపురుషుని ఎదట.

వెంటనే గిరుక్కున తిరిగి పోదామనిపించిందామెకి. కాని స్తిమితపడి ఆలోచించి, "ఎన్నాళ్లక్కడ ఉండగలను?" అని అధైర్యపడి ఆ ఇంట్లోనే ఉండటానికి నిశ్చయించుకుంది. ఆమె ఆలోచనలో రామచంద్రమూర్తి అక్కణ్ణించి వెళ్లిపోటం గమనించలేదు. కాసేపటి తర్వాత, తలెత్తి చూసి అతను వెళ్ళిపోయాడని గ్రహించి, ఏమీ తోచక, చివరికి పక్కగదిలోకి వెళ్లి కూలబడ్డది.

"మూర్తి ప్రవర్తన నాకేమీ బావుండలేదమ్మాయి."

ఆశ్చర్యంతో తలెత్తి చూసింది సుగుణ. ఇందాకటి యువకుడు గదిగుమ్మందగ్గిర నిలబడివున్నాడు. చప్పున ఆమె తలదించుకొని చూపులు మరల్చుకుంది.

"నిజం చెబుతున్నాను. మా మనోరమ నీకంటె ఏమంత అందంగా ఉందని? ఆమాటకొస్తే నీ అందంలో నూరోవంతుకూడా దానికి లేదు. మూర్తి ఇంత పిచ్చివాడయాడేమిటా అని ఆలోచిస్తున్నాను."

సుగుణకి ఈ సంభాషణ ఏమీ నచ్చలేదు. ఆమెకి ఆ సమయంలో ముఖ్యంగా ప్రశాంతత కావాలి. చెదిరిన మనస్సుని కుదుటబర్చుకోవాలి.

సుగుణ దగ్గిర్నించి ఏమీ ప్రత్యుత్తరంగాని, కనీసం తన మాటల్ని శ్రద్ధగావినే ఆసక్తిగానీ లేకపోవటంతో ఆ యువకుడు మరో రెండుక్షణాలు అక్కడ నుంచుని తరవాత వెళ్లిపోయాడు.

సుగుణ తన గడచిన రెండుసంవత్సరాల చరిత్రనీ సింహావలోకనం చేసుకుంది. హృదయాధిపత్యం కోసం ఆశించి కలలుకంటే, చివరికి హృదయంలో ఓమూల కాస్త చోటుకోసం పాకులాడాలిసొచ్చింది. అదే తన గడచిన చరిత్ర.

ఆ మధ్యాహ్నం ఆమె భోజనం చేసిందో లేదో కనుక్కున్న వాళ్లెవ్వరూ లేరు. అయినా ఎవరుంటారు—మూర్తిని మినహాయించి, ఆమె స్థితిగతులు కనుక్కోవాలిసిన అవసరం ఆ ఇంట్లో ఎవరికుంది? మూర్తికి ఆమె భోజనంసంగతి జ్ఞాపకం లేదు. మూడు గంటలకి కాఫీతాగేటప్పుడుమాత్రం సుగుణ భోంచేసిందో లేదో అనే విషయం అతనికి అకస్మాత్తుగా తట్టింది. "ఇంటిదగ్గిర భోంచేసే వొచ్చివుంటుంది" అని సమాధానపరచుకున్నాడు.

ఆరోజు శనివారంకావటంవల్ల ఏదో ఓ సినిమాకి వెళ్లితీరాలి. అదిగాక సుగుణవిషయంలో మనోరమని కాస్త బతిమాలుకోవలసిరావటంవల్ల సినిమా ప్రయాణం మరీ తప్పనిసరయింది. మొదటి ఆటనించి తిరిగొచ్చి మేడ ఎక్కబోతున్న సమయంలో "కేరు" మని ఏడ్పు వినబడ్డది మూర్తికి. అంతవరకూ అతని స్మృతిలో సుగుణ అదృశ్యమయింది. తటాలున ఈ ఏడ్పు విని సుగుణని గురించి ఆలోచించాడు మూర్తి. ఆమె ఇక్కడికి రావటం అతనికి ఎంతమాత్రం ఇష్టం లేదు. కాని ఆమెని గట్టిగా ఇక్కడ ఉండటానికి వీల్లేదనటానికి ధైర్యం చాలలే దతనికి. ఈ ఆలోచనలలో సుగుణ ఈరాత్రి అన్నం తినిఉండదనే విషయం అతనికి అకస్మాత్తుగా తోచింది. ఎలా తింటుంది? ఏ దేవతలో కరుణించి ఆమెగదిలో ఆహారం పడేసే కాలం కాదుగా ఇది! అతనికి జాలివేసింది. సుగుణ గదివైపు వెళ్ళాడు. గదిలోంచి తొంగిచూశాడు. వొళ్లో పిల్లవాడిని పడుకోబెట్టుకుని కూర్చుంది సుగుణ.

"అన్నం తిన్నావా?" అర్థంలేని ప్రశ్న అడిగా డతను.

సుగుణ ఉలిక్కిపడి తలెత్తి చూసింది వెంటనే మళ్ళీ తల కిందికి దించుకుని హీనస్వరంతో అంది.

"ఆకలి లేదు."

నిజానికి ఆమెకి ఆకలిగానే ఉన్నది. ఆకలిగా లేదంటే ఎవరూ బతిమాలరనికూడా ఆమెకి తెలియక పోలేదు. కాని "ఆకలి లే"దందామె, అనాలనే.

మూర్తి ఏమీ మాట్లాడలేదు. కాసేపు అలాగే నుంచున్నాడు. తరవాత వెళ్లిపోయాడు.

అతను వెళ్ళిన చప్పుడు విని సుగుణ అతని వైపు శూన్యంగా చూసింది.

గడియారం పదిగంటలు కొట్టింది. సుగుణ లేచి పిల్లవాడిని సోఫాలో పడుకోబెట్టి తను సోఫాకి ఆనుకుని కిటికీలోంచి మేఘాలు కమ్మిన ఆకాశంలోకి చూడసాగింది. ఆ రాత్రి గడియారం కొట్టిన గంటలన్నీ విందామె.

తెల్లవారింది. అయినా సుగుణ అలాగే కూర్చునిఉంది. ఆమెకి ఏం చెయ్యటానికీ తోచటం లేదు. ఆ ఇంట్లోని ప్రతివస్తువూ ఇప్పుడు తనది కాదు.

"అదేమిటమ్మాయ్, రాత్రల్లా ఇలాగే కూర్చున్నావేమిటే?"

తల తిప్పకుండానే నిన్నటి యువకుడి గొంతేనని ఆనవాలుపట్టింది సుగుణ. ఆమె ప్రత్యుత్తరం ఇవ్వటం అవసర మనుకోలేదు.

"చూస్తే, రాత్రి అన్నంకూడా తిన్నట్టు లేవు."

ఈసారి కూడా జవాబు చెప్పలేదు సుగుణ.

"మూర్తి ఇంతటి పసు వనుకోలేదు. మెత్తటి వాళ్లని చూస్తే ఎవరికైనా ఇంతేలే."

కాసేపటితరవాత సుగుణ తలెత్తిచూసేసరికి ఆ యువకు డక్కడ లేడు. మరికాసేపటిలో లోపల ఏవో కేకలు వినిపించాయి. తరవాత సుగుణ గదిలోకి వంటసామగ్రి అంతా చేరింది.

"మూర్తికి ఈమాత్రం జ్ఞానంకూడా లేకపోవటం ఆశ్చర్యంగా ఉంది." అన్నాడు సామాను చేరవేస్తూ ఆ యువకుడు. సుగుణ అతనికి మనసులో కృతజ్ఞత చెప్పింది.

"చూడమ్మాయ్, నాపేరు భూషణ మంటారు, నీ కేమైనా కావాలిస్తే నాతో చెప్పు, క్షణంలో చేసిపెడతాను." సుగుణ మర్యాదకి తల తిప్పింది. కాని ఆ యువకుడు తనపట్ల ఇంత శ్రద్ధతీసుకోటం ఆమె కేమాత్రం ఇష్టంలేదు.

పగలూ, రాత్రీ వరసప్రకారం వొస్తూ, పోతూ ఉన్నాయి. రాత్రింబగళ్లు తేడాలో సుగుణకి ఉత్సాహమేమీ లేదు. ఆ ఇంట్లో ఆ భూషణాన్ని మినహాయిస్తే తన సంగతి కనుక్కునే వాళ్ళెవరూ లేరు. మూర్తి తను ఎదుటపడితేనే చీదరించుకుంటున్నాడు. స్వతహాగా అతిసిగ్గుగల స్వభావమేమో, భూషణంతో మాట్లాడటానికి ఆమెకి ఇష్టం లేదు.

చూసిచూసి, ఓ రోజున అడిగేశాడు భూషణం. "నాపట్ల నీ కింత అయిష్ట మెందుకు ?"

బావుండదని సుగుణ అంది. "అయిష్ట మేముంది ?"

"అయితే ఇష్ట మేనా ?"

అతని తరహాచూసి సుగుణ "ఎందు కలా అన్నా నా?" అని పశ్చాత్తాప పడ్డది.

"సుగుణా !"

సుగుణ అదిరిపడ్డది. తను వొచ్చిన ఈ పది, పదిహేను రోజుల్లోనూ తనని పేరుపెట్టి ఎప్పుడూ పిలవలేదు భూషణం. ఆ పిలుపుతో ఆమె కేదో అశుభసూచకం గోచరించింది.

"నీ విషయం మూర్తితో మాట్లాడాను, కాని అతను సుతరామూ నామాటలు చెవికెక్కించుకో లేదు. అతని వైఖరి చూస్తే నాకు పరమ అసహ్యం వేసింది. నీపేరు వింటేనే అతను చిర్రుబుర్రు లాడుతున్నాడు."

"మీరు నన్ను గురించి పడ్డ శ్రమకి మీకు చాలా కృతజ్ఞురాలిని. కాని నాతరఫున వారితో ఏమీ మాట్లాడవొద్దని మిమ్మల్ని వేడుకుంటున్నాను."

"అతని మనస్సేమైనా మారుతుం దేమోనని ఆశించాను. 'కాని ఆవిడతో నా కేమీ సంబంధం లేదు' అని నిష్కర్షగా చెప్పాడు. అతను అంత టెక్కుగా ఉన్నప్పుడు నువ్విలా అతని అడుగులకి మడుగులొత్తటం ఏమీ బావుండ లేదు. అతను చేసిన అన్యాయానికి నువ్వు ప్రతీకారం చేస్తేనేకాని అతనికి చెప్పుతో కొట్టినట్టుండదు."

ఈ ఉపన్యాసం సుగుణ ఎంతమాత్రం వినదల్చుకో లేదు.

"నన్నిలా ఉండనియ్యండి." అందామె కొంచెం చిరాకుగా.

"నిన్ను పురుగులా విదిలించిపారేసేవాడి కాళ్లు పట్టుకోటం నీకే మంత ఘనం ? నీ అనుగ్రహంకోసం నీ కాళ్లు పట్టుకునే వా శ్శెంతోమంది ఉన్నారు."

చివరిమాటలకి సుగుణ బుస్సుమంది.

"దయచేసి మీరు ఇటువంటి మాటలు నాకు చెప్పకండి."

"సుగుణా, నువ్విలా కోపగించుకుంటే ఎలా? మనస్ఫూర్తిగా చెబుతున్నాను, విను. నీ చల్లని చూపుకోసం నీ గుమ్మందగ్గిర పడికాపులు కాస్తున్నాను. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. నామాట విను."

సుగుణ తీక్ష్ణంగా అతనివైపు చూసింది.

"ఈ సారి ఇటువంటి మాటలు రానిస్తే వారితో చెబుతాను. మర్యాదగా వెళ్ళండి."

భూషణం తల పంకించాడు.

"ఈ ఇంట్లో నామాట కాదనేవాళ్లు ఎవరూ లేరని నువ్వు ముందే తెలుసుకోటం మంచిది."

ఎర్రబడ్డ అతని కళ్లనీ, కటువుగా వినవొచ్చిన అతని మాటల గాంభీర్యాన్నీ చూసి నిలువునా వొణికింది సుగుణ.

"నన్నిలా బాధించటం మీకు భావ్యంకాదు." అంది జాలిగా.

"నీకోసం నే నెంత బాధపడుతున్నానో నీకు తెలియదు. సుగుణా. నా మాటలు కాదనకు. మూర్తిని చూసి భయపడుతున్నావేమో! అతను నా గుప్పిటలో ఉన్నాడు. క్షణంలో అతన్ని పిల్లిలా చెయ్యగలను."

ఈసారి సుగుణకి భయంపోయి ఏహ్యం, కోపం కలిగాయి.

"మాటలతో వెళ్లదలుచుకో లేదా ?" కటువుగా అంది.

ఆమెవైపు తన ఎర్రటి కళ్లతో చూసి తల నిలువుగా ఆడించి.

"తెలిసివొస్తుందిలే, హుం" అని చర్రున వెళ్లిపోయాడు భూషణం.

భూషణం వెళ్లిన పది నిమిషాలకి మూర్తి ఇంట్లో అడుగుపెట్టాడు. మూర్తితో భూషణం విషయం ముందే చెప్పకపోతే తన కేదో కీడుమూడుతుందని అనుమానించింది సుగుణ. అతను తనగది దగ్గిరికి రాగానే, ఆమె తలుపు దగ్గిరికి ఒచ్చి మూర్తివైపు చూసింది.

"ఒకసారి ఇలా వొస్తారా ?"

మూర్తి కాసేపు తటపటాయించి గది తలుపు దాకా వెళ్లి.

"ఎందుకు ?" అన్నాడు. సుగుణ విషయం చెప్పటానికి కొంచెం సంకోచించింది.

"అవతల నాకు చాలా పనుంది. త్వరగా తేల్చు." అన్నాడు మూర్తి విసుగ్గా.

"భూషణంగారిని చూస్తే నాకు భయంగా ఉంది." అంది సుగుణ నెమ్మదిగా.

"ఎందుకు భయం ? నిన్ను ఎత్తుకుపోయేటంత మూర్ఖుడు కాడులే."

"ఎందుకో నా కాయన్ని చూస్తే భయం వేస్తోంది."

"అయితే నన్ను కాపలా కూచోమంటావా ? లేకపోతే ప్రత్యేకంగా గూర్ఖావాణ్ణి నియమించాలా?"

"అది కాదు."

"ఏది కాదు? నీమొహం. మహాపతివ్రతలా ఇక్కడ నన్ను పట్టుకొని వేళ్ళాడమని ఎవడేడిశాడు ? లేకపోతే..."

సుగుణకి కళ్ళవెంబడి నీళ్లు తిరిగాయి,

"మాట్లాడితే ఏడుపూ, ఛీ." కసురుకుని చర చర నడిచిపోయాడు మూర్తి. బరువుగా కింద కూలబడ్డది సుగుణ. విచారంలో ఆమెకి ఎంతసేపు తను అలా కూర్చుందీ తెలియలేదు.

"సుగుణా."

ఉలిక్కిపడ్డది సుగుణ. ఎదురుగా నుంచున్న భూషణాన్ని చూసేసరికి ఆమెకి పైప్రాణం పైనే పోయింది. మసక చీకటి అప్పుడే అలుముకుంది.

"ఏం చేస్తావు నా మనవిని."

సుగుణ భీతితో లేచి నుంచుంది.

"ఇంత అందగత్తెవి ! నిజంగా మూర్తికి కళ్లు లేవు సుగుణా!"

"భూషణంగారూ, మీ కాళ్లు పట్టుకుంటాను. అటువంటి మాట లనకండి."

భూషణం పొడిగా నవ్వాడు.

"నేనే నీకాళ్లు పట్టుకోటానికి వొచ్చాను. సుగుణా....".

కోపంతో ఎఱ్ఱబారిన ఆమె ముఖం చూసి మరింత పరవశుడై భూషణం ఆమెచెయ్యి పట్టుకోటానికి ముందుకు వెళ్లాడు. సుగుణ కేకలువెయ్యటానికి ప్రయత్నించింది.

"అల్లరిపెడతావా ?" గద్దించాడు భూషణం.

అసహాయంగా దిక్కులు చూసింది. సుగుణ.

"ఇవాళ, శనివారం. అంతా సినిమా కెళ్లారు. ఎవరికీ తెలియదులే. నా ప్రేమని కాదనకు."

ఈ మాటలు వినేసరికి మిగిలిన కాస్త ఆశా కూడా ఎగిరిపోయింది సుగుణకి. గత్యంతరం లేక, మీద మీద కొస్తున్న భూషణాన్ని గరిటె తీసుకుని తలమీద గట్టిగా కొట్టింది. దెబ్బ తిని భూషణం మరింత రౌద్రమూర్తి అయినాడు. అతను తలతడుముకునేలోపల చురుగ్గా గదిదాటి వీధివైపు పరిగెత్తింది సుగుణ. చేసేది లేక బుసలుకొడుతూ భూషణం లోపలి కెళ్లిపోయాడు.

రాత్రి మూర్తీ, మనోరమా సినిమానుంచి తిరిగొచ్చేదాకా వీధి అరుగుమీదే కూర్చుంది సుగుణ. మూర్తి బండి దిగి లోపలికి వెడుతుండగా ఆమెకూడా అతని వెనకాలే వెళ్లింది. మూర్తి సుగుణని చూసి ఆశ్చర్యపడ్డాడు. కాని అతను ఆమె నేమీ అడగలేదు. తన గది దాటిపోతుంటే సుగుణే అంది. కరకుగా.

"భూషణాన్ని జాగ్రత్తగా మసులుకోమనండి."

ఈ కఠోరస్వరాన్ని విని మూర్తీ, మనోరమా చకితులైనారు. మూర్తి వెనక్కి తిరిగి సుగుణవైపు చూశాడు. ఆమె పెదవులు వొణుకుతున్నాయి.

"ఇవాళ దెబ్బతో సరిపోయింది. ఉద్రేకంలో, రేపు, ప్రాణమే పోవచ్చు."

సుగుణని ఈరూపంలోగాని, ఆమెనోటంట ఇంత కఠినంగా మాటలు రావటంగాని, మూర్తి ఎరగడు.

"ఇంతింతలేని మాటలు మా అన్నయ్యనే!" మనోరమ మూర్తివైపు చిక్కమొహంతో చూసి అంది.

"మీ అన్నయ్యో, తమ్ముడో నాకు తెలియదు. ఇది సానికొంప అయితే కావొచ్చు. కాని సంసారులుకూడా ఉన్నారు. తరవాత పశ్చాత్తాపపడితే లాభం లేదు."

మనోరమ తనవైపు నిస్సహాయంగా ప్రణయ కోపంతో చూసేసరికి మూర్తికి కొంత వేడి కలిగింది.

"సుగుణా!" అన్నాడు కోపంగా.

సుగుణ ఇప్పుడు ఎంత చిన్న అవమానకరమైన మాటనీ సహించే స్థితిలో లేదు.

మండే కళ్లని మూర్తివైపు తిప్పిందామె.

"ఏమిటీ వాగుడు?"

"మానాభిమానాలు గల ఏ ఆడదైనా ఇలాగే వాగుతుంది ఈ సందర్భంలో."

"మానాభిమానా లుంటే, వొద్దన్నకొద్దీ ఇలా కాళ్లమీద ఎందుకు పడతావు?" అంది మనోరమ కసి తీర్చుకుంటూ.

"మానాభిమానాలంటే నీకు తెలియకపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు." అప్రయత్నంగా అంది సుగుణ. తర్వాత ఆ మాటలు అన్నందుకు చాలా విచారించింది.

"నోరు ముయ్యి." అన్నాడు మూర్తి.

సుగుణ ఇప్పుడు మాటలుపడే స్థితిలో లేదు' ఉద్రేకం కట్టలు తెంచుకుని ప్రవహిస్తోంది ఆమెలో

"భూషణాన్ని అలా గద్దించగల సాహసం ఉంటే మీరు నన్నలా అని ఉండరు."

"ఈవిడతో కలిసి ఈ ఇంట్లో నే నింకా ఒక్కరోజుకూడా ఉండలేను." అంది మనోరమ.

"సుగుణా, రేపు పొద్దున్నే నువ్వు ఇక్కణ్ణించి వెళ్లిపోవచ్చు. ఇహ జీవితంలో నీ మొహం నాకు చూపించక్కర్లేదు. కావాలంటే భరణం ఇస్తాను."

చివరిమాటలు మూర్తి అని ఉండకపోతే సుగుణ ఇంకా దులిపి ఉండేది. కాని మూర్తి అన్న ఆఖరు మాటలు ఆమెని ఒక్కసారిగా కుంగదీశాయి. భరణం! తిండికోసమా తను అతన్ని వివాహమాడింది.

"మీ రిచ్చేభరణానికి నాలుగురెట్లు మా నాన్నగారు మీ కియ్యగలరు." ఆవేశంతో అంది సుగుణ. "పెళ్లిచేసుకుంది భరణం ఇవ్వటానికా? ఆనాటి వాగ్దానాలన్నీ అంత ఆకస్మికంగా మర్చిపోయారా?"

"నాకు జ్ఞాపకం ఉన్నంతలో నే నేమీ వాగ్దానాలు చెయ్యలేదు."

"పెళ్లినాడు మీరు చదివిన మంత్రాలు..."

"అదీ. నాకు సంస్కృతం రాదు."

మనోరమ నవ్వింది. ఈ ఒక్క ఛెణుకుతో ఆమె అవమానం అంతా తీరినట్టు భావించుకుంది.

ఆ రాత్రి మొదటిసారిగా సుగుణ వెక్కి వెక్కి ఏడ్చింది. అంతవరకూ ఆమెకళ్లలో కన్నీళ్లు తిరగటమేగాని, బరువంతా తీరేట్టు దుఃఖించటం జరగలేదు.

తెల్లవారగానే సుగుణ పుట్టింటికి బయలుదేరింది. నెలరోజులైనా కాకుండా కూతురు తిరిగి రావటం చూసి, జగన్నాధరావుపంతులు గుండె గుబుక్కుమంది.

బండీ దిగి సరాసరి ఇంట్లోకి వెళ్లిపోయింది సుగుణ. జగన్నాధంపంతులు ఆమె వెనకాలే ఇంట్లోకి వెళ్లాడు. సుగుణ కిటికీలోంచి శూన్యంలోకి చూస్తోంది.

"అమ్మాయి!"

సుగుణ అతనివైపు చూసి, కళ్ళు తుడుచుకుంది.

"మళ్లీ ఏమైనా..."

సుగుణకి ఆపుకోలేనంత ఏడుపొచ్చింది. వల వల ఏడ్చేసింది, కూతురు తలనిమురుతూ అన్నాడు జగన్నాధంపంతులు.

"దీనికంతా కారణం డబ్బమ్మా. అది పోయిన క్షణంలో తెలిసొస్తుంది, అతనికి. డబ్బయిపోగానే కుక్కని తరిమినట్టు తరుముతుంది ఆ మనోరమ అతన్ని. ఏమిటో అనుకుంటున్నాడు గావును."

సుగుణ ఏడుపు ఆపుకోవాలని వ్యర్థప్రయత్నాలుచేసింది.

"మనసులో ఉంటుందిగాని, డబ్బేం చేస్తుంది నాన్నా."

"అదేనమ్మా. మనసు గట్టిదికాకపోతే డబ్బు దాన్ని ఇష్టంవొచ్చినట్టు ఆడిస్తుంది. డబ్బు పోయిననాడు గాని తెలీదు దాని మజా. అతనికి బుద్ధిరావాలంటే ఒకటే మార్గం."

సుగుణ ఆశతో చూసింది తండ్రివైపు.

"మైనరు దావా వేస్తాను."

"అఁ!" అంది సుగుణ భయంతో, ఆశ్చర్యంతో.

"అవును."

"వొద్దు నాన్నా, ఈ దావాలు. పరువు పోటం అలా ఉంచి అసలు పూర్తిగా తెగిపోతుంది."

"లేదమ్మా, నేను బాగా ఆలోచించే చెబుతున్నాను. ఏదో ఇల్లు కట్టిస్తున్నాడన్నావు గదూ. సగం ఆస్తి అమ్మేసి ఉంటాడు. లేదా సగం ఆస్తి మేరకి అప్పు తెచ్చి అయినా ఉంటాడు. సగం ఆస్తి కొడుక్కి పంచమని దావా పడేస్తాను, దూబరా ఖర్చులు చేస్తున్నాడనీ, అవి మైనరుకి నష్టదాయకమనీ."

సుగుణ కాసే పాలోచించింది. డబ్బు పోతేనైనా తన తప్పుని తెలుసుకుంటాడేమో!

"సరే, నాన్నా."

"రేపే పడేస్తాను. సగం ఆస్తి ఎలా గోకరా రావడి అయి ఉంటుందిలే. మిగతా సగం పీడి కొస్తే ఇహ చిప్ప చేత్తో పట్టుకుని చేసిన తప్పుల్ని నెమరేసుకుంటాడు." సుగుణ సరేనంది గాని ఆమె మనసులో బెరుగ్గానే ఉంది. దీనివల్ల ఏం విషమఫలితాలు కలుగుతాయోనని.

మర్నాడు కొడుక్కి ఆస్తి పంచమని రిజిస్టర్డు నోటీసు ఇప్పించాడు జగన్నాథంపంతులు. రామచంద్రమూర్తికి. నోటీసు చూసుకుని "ఇదేదో బెదిరింపులే" అనుకున్నాడు మూర్తి. కాని వారంరోజుల తర్వాత పార్టిషన్ దావా పడేసరికి అతను ఓ ప్లీడర్ దగ్గరకు వెళ్లాడు సలహాకోసం. ప్లీడరుగారు ఒక క్షణం కనుబొమలు చిట్లించి, ఆలోచించి అన్నాడు.

"మీరు చేసిన ఖర్చులు చూస్తే, ఆస్తిని పంచక తప్పదేమో ననిపిస్తోంది."

మూర్తికి గుండెల్లో రాయిపడ్డది. ఒకటి రెండు రోజులకిందటే తను కొత్తగా కట్టిన ఇల్లు పూర్తయింది. దానికోసం బోలెడంత అప్పు చేశాడు. పైగా ఒచ్చిన పెద్ద చిక్కేమిటంటే ఆ ఇల్లు కట్టిన స్థలం, ఇల్లూ అంతా మనోరమ పేరే ఉన్నాయి. డబ్బు దుర్వినియోగం చేసినట్టు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఇప్పుడు ఆస్తిపంపిణీ జరిగితే తనకి మిగిలేది ఇహ ఏమీ ఉండదు! అతను దైన్యంగా ప్లీడర్ గారి ముఖంలోకి చూశాడు. ప్లీడరుగారు అతని వైఖరి చూసి అన్నాడు.

"ఒక విషయం అడుగుతాను. మీకు కోపం రాదుగదా!"

"అడగండి"

"మీ భార్యని మీరు వొదిలేసినట్టేనా?"

మూర్తి తక్షణం ఏమీ జవాబు చెప్పలేక పోయాడు.

"చెప్పండి. ఈ రహస్యాలు నాకూ, మీకూ తప్ప ఎవరి చెవినీ పడవు. పరవాలేదు, చెప్పండి."

"ఏమో." అన్నాడు మూర్తి.

"మనసులో ఉన్నమాట చెప్పండి."

"ఆ అవకాశం ఏమీ లేదేమో!" అన్నాడు మూర్తి. ఈ మాటలు అంటున్నప్పుడు అతనికి ఒక్క క్షణం సంకోచమూ, కొద్దిగా బాధా కలిగినమాట వాస్తవం.

"ఆ అవకాశం ఏమాత్రమూ లేనట్టయితే, ఒక సలహా చెబుతాను."

"ఏమిటది."

"మీరేమీ అనుకోకూడదు. మా వృత్తిధర్మాన్ని అనుసరించి మేం సలహాను ఇస్తూంటాము. ఆచరించటం, ఆచరించకపోవటం. మీ ఇష్టాఇష్టాలనుబట్టి ఉంటుంది."

"చెప్పండి."

"మీ భార్యతో మీరు కాపరం చెయ్యక పోటానికి కారణం?"

"ముందరే చెప్పానుగా. మనోరమ అనే వేశ్య మీద నా మనసు పోయింది."

"అంతేనా కారణం? లేక..."

"అంతే"

"ఇంకేమీ లేదా?"

"ఊఁహుఁ."

"మీ భార్య చాలా ఉత్తమురాలనుకుంటాను. అంటే..."

"ఆవిడ మంచిదే పాపం."

"జగన్నాథంపంతులుగార్ని నే నెరుగుదును. వారి అమ్మాయికూడా ఆయనంతటి గుణవంతురాలనే..."

'గుణవంతురాలు' అన్నప్పుడు నొక్కి పలికాడు ప్లీడర్.

"అదంతా ఎందుకులెండి ఇప్పుడు."

"ఇదివరకు ఇలాంటి కేసు ఓటి నడిపాను నేను. గెలిచానుకూడా. ఇలాగే పార్టిషన్‌దావా పడేశాడు మనమడితరఫున తాత. మైనరు వాడు కొడుకు కాదన్నాడు రెస్పాండెంట్. ఫైసల్."

"ఛీ." అన్నాడు మూర్తి. "ఛీ.... ఛీ... అదా. ఇందాకటి నించీ మీరనేది. ఛీ."

"కేసు గెలవాలంటే అదొక్కటే మార్గం."

"అయితే ఓడిపోతాను లెండి."

"బాగా ఆలోచించుకోండి. మీ ఇష్టం. అయితే, రేపట్నుంచి మీ చేతిలో చిల్లిగవ్వకూడా ఉండదు. మనోరమ అన్నారే, ఆవిడ మిమ్మల్ని అసలు దగ్గిరకే రానియ్యదు."

మనోరమ! ఈ నాలు గక్షరాలూ మూర్తికి ప్రాణంకంటె ప్రియతమాలు.

"అంత అన్యాయం ఎలా చేయమంటారు!" అన్నాడు కొంచెం తగ్గి మూర్తి.

"ఇప్పటిదాకా మీరు చేసింది న్యాయమా ?"

మూర్తికి సమాధానం దొరకలేదు.

"అసలు ఋజువు ఎలా చేయగలం ?"

"అదంత పెద్దకష్టం కాదని నా అభిప్రాయం."

"నా మనస్సు ఒప్పుకోటం లేదండీ. అంత ద్రోహం ఎలా చెయ్యమంటారు ?"

"నే నేమీ చెయ్యమంటం లేదు. ఉన్న సంగతి చెప్పాను. మీ ఇష్టం వొచ్చినట్టు చెయ్యొచ్చు.

మూర్తి మనస్సు ఉయ్యాల లూగింది.

"ఆన్సర్ పడెయ్యనా ?" అన్నాడు ప్లీడర్ అతని మనస్సు కనిపెట్టి.

"మీ ఇష్టం." అన్నాడు మూర్తి ప్లీడర్ వైపు చూసి.

"సరే, ఇహ మీరు వెళ్లొచ్చు."

మూర్తి బరువుగా లేచాడు. నడుస్తున్నాడు గాని అతని మనసు మనసులో లేదు. ఏదో తీరని అపచారం చేస్తున్నట్టుగా భావించాడు. తన అంతరాత్మకి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నట్టు అనుభూతి పొందాడు. ఆలోచనలు ఎక్కువైనకొద్దీ అతనికి కోపంకూడా ఎక్కువైంది.

"అయినా, వాళ్లు చేజేతులా చేసుకున్నదే ఇది. తనని బహిరంగంగా కోర్టుకి ఈడ్చి తనకి ఎవరో వేశ్యతో సంబంధం ఉందని నిరూపించి తనని అపఖ్యాతిపాలు చేయటానికేగా ఈ ప్రయత్నం! సుకున్నవాళ్ళకి చేసుకున్నంత. అనుభవించనీ.

ఈ విధంగా తనని తను సమర్థించుకున్నాడు: కాని తన సంతృప్తిలో ఏదో వెలితి, ఏదో కుంటితనం, ఏదో మాఢ్యం ఉందని అతనికి చూచాయగా తెలుసు. కాని తను అనుసరించిన మార్గం న్యాయమైనదేనని వాదించుకున్నాడు మనసులో. అలా వాదించుకోనటంవల్ల అతనికి సంతృప్తి కలగకపోగా మరింత అసంతృప్తి కలిగింది. ఆరాత్రంతా అతనికి బాధతో నిద్రపట్టలేదు. ఏవో పిచ్చి, పిచ్చికల లొచ్చాయి. చాలాసార్లు, "అవును. వాళ్ళకలా శాస్తి కావలసిందే" అని తన మనసులో చెప్పుకున్నాడు.

మూర్తి ప్లీడర్ ఆన్సర్ పడేశాడు. ఆన్సర్ చూసి జగన్నాథంపతులు దిమ్మరపోయాడు. అల్లుడు ఇంత దౌష్ట్యానికి ఒడిగడతాడని ఆయన ఊహించుకోలేకపోయాడు. తన ప్లీడర్ దగ్గిర్నించి ఆన్సర్ కాపీ తీసుకుని ఇంటిముఖం పట్టాడు... ఎదురుగా సుగుణ వొచ్చింది.

"ఆన్సర్ పడేశాడమ్మా." అని, వెంటనే మళ్ళీ నాలుక కరుచుకున్నాడు.

సుగుణ ఆయన చేతిలోని కాగితాలు తీసుకుని చదవసాగింది. ఆమె చేతులు ఒణికాయి.

"ఇదేమిటి నాన్నా, ఈ పేరా అర్థం ఏమిటి?" సుగుణ నుంచోలేకపోయింది. దభాలున అక్కడున్న ఓ కుర్చీలో కూలబడ్డది. ఆమె కాళ్ళూ, చేతులూ వొణకసాగాయి.

"మూర్ఖుడు." అన్నాడు జగన్నాథంపంతులు.

సుగుణకి భూమి గిర్రున తిరుగుతున్నట్లు స్పష్టపడింది. రెండుచేతులుతో ఆమె తల పట్టుకుంది. ఆమె అవస్థచూసి జగన్నాథంపంతులుకి కళ్ళవెంబడి అశ్రువులు టపటప రాలాయి.

"ఇంత అన్యాయమా ?" గద్గదికంగా అంది సుగుణ.

"హుం. కాగితంమీద రాయగానే సరా! ఎలా ఋజువుచేస్తాడో చూస్తాను. జగన్నాథంపంతు

అంటే ఎవడనుకున్నాడో! వీడు పట్టిన కేసు ఓడట మనేది ఎన్నడూ లేనేలేదని వాడికేం తెలుసు! నా కెదురుగా ఉన్న ఒక్కొక్క ప్లీడర్ చూడు చెరువుల నీళ్ళు తాగాడు. నా తడాఖా చూపిస్తాను. హుం. ఇంత అన్యాయమా."

ఉద్రేకంలో ఏమేమో అనసాగాడు జగన్నాథం పంతులు. సుగుణ నిశ్శబ్దంగా శూన్యంలోకి చూస్తూ ఆలోచించింది. జగన్నాథం కాస్త శాంతించినతరవాత సుగుణ అంది.

"దావా ఒదులుకుందాం, నాన్నా."

"అదేమిటమ్మాయ్?" అన్నాడు జగన్నాథం పంతులు ఆశ్చర్యంగా.

"అవును నాన్నా. వొదులుకుందాం."

"ఎందుకు? ఇప్పుడు దావా వొదులుకుంటే ఇంకేమన్నా ఉందా? ఎంత అప్రతిష్ఠ!"

"అప్రతిష్ఠ ఏం ఉండదు నాన్నా."

"ఎందు కుండదమ్మాయ్. ఆరోపణని ఖండించి, శుద్ధ అబద్ధమని మనం ఋజువుచేసుకోవద్దూ? లేకపోతే అంతా అది నిజమేనని పుకారు వెయ్యరూ?"

"ఎవరికోసం నాన్నా ఋజువులు? లోకానికా?"

"నలుగురు పెద్దమనుష్యులకీ అది అబద్ధమని..."

"పెద్దమనుషుల నమ్మకాలతో మనకి పనేమిటి? నమ్మవలసినవాళ్లు నమ్మితే చాలు."

"అంటే?"

"వారు ఈ ఆరోపణ నిజమేనని మనస్ఫూర్తిగా నమ్మితే మనం చేసే ఋజువులు అనవసరం. కేవలం కేసు గెలవటానికే వారు ఇలా చేస్తే ఋజువులు అంతకంటే అనవసరం. ఇంత ద్రోహం చెయ్యటానికి డబ్బే కారణమయితే, ఆ డబ్బుని వారినే తీసుకోనీ. కాని నేను నిజం తేల్చుకోవాలి."

"మళ్ళీ నువ్వక్కడికి వెడతా నంటావా ఏమిటి?"

"అవును."

"ఎందుకమ్మా, ఇంతవరకూ పొందిన అవమానాలు చాలవూ?"

"ఇది ఆఖరుసారేమో నాన్నా. ఏదో ఒకటి ఈసారి తేలిపోవచ్చు."

జగన్నాథంపంతులు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"తల్లిలేని పిల్లవని ఎంతో గారాబంగా పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి చివరికి ఓ దుర్మార్గుడి చేతుల్లో పెట్టానమ్మా నిన్ను."

"మనం సర్వజ్ఞులం కాదుగా నాన్నా. జరిగిందానికి మనం విచారించటం అనవసరం. ఎవరి అదృష్టం వాళ్ళది."

"ఆపదల్లో ధైర్యం చెప్పుకోటానికి అది ఒక్కటే మార్గం."

ఆ రోజే ఇద్దరూ పట్నం బయలుదేరారు. దావా వొదులుకున్నానని ఇద్దరు ప్లీడర్లతో చెప్పటానికి జగన్నాథంపంతులు బయలుదేరాడు.

పట్నం చేరగానే జగన్నాథంపంతులు దిగిపోయాడు బండిలోంచి. ఇల్లు సమీపిస్తున్నకొద్దీ సుగుణకి గుండె గబగబ కొట్టుకోసాగింది.

ఓరగా వేసిన తలుపు తెరుచుకొని లోపలికెళ్ళింది సుగుణ. ఎదురుగా మూర్తి ఉన్నాడు. తలుపు చప్పుడు వినగానే తలెత్తి చూశాడు. సుగుణ!

మూర్తికి మనసు మనసులో లేదు. సుగుణని చూడగానే అతనికి ముచ్చెమటలు పోశాయి. క్రాస్ ఎగ్జామినేషన్‌కి గురికాబోతున్న ముద్దాయిలా ఓక్షణం కంపించాడు.

సుగుణ అతనికి దగ్గిరగా వొచ్చింది. అతను వొంచిన తల ఎత్తలేకపోయాడు. రాబోయే తుపానుకు సిద్ధపడినవాడిలా చేతులు ముడుచుకు కూర్చున్నాడు.

సుగుణ నోట్లోంచి ఒక్క మాటకూడా రాలేదు. ఏమనాలి, ఏం చెప్పాలి? ఎలా మొదలుపెట్టాలి, అసలావిషయం ప్రస్తకి తీసుకురావటం ఎలా?

ఎంతసేపటికీ, ఏమీ మాటలు వినపడకపోవటం వల్ల మూర్తికి ఆశ్చర్యం వేసింది. తుపానుముందు కలిగే నిశ్శబ్దమేనా ఇది? తన నేవిధంగా సమర్థించుకుంటాడు? అసలు ఎలా సమర్థించుకోగలడు? ప్రత్యక్షంగా సుగుణ వొచ్చి సవాలుచేస్తుంటే! అబద్ధం ఆడా లనుకున్నా అసలు అది నోట్లోంచి బయటికి రావొద్దూ?

సుగుణ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. మాటలు పెకలిరావటం లేదు. ఆమె కెందుకో ఒక్కసారి గట్టిగా ఏడ్చేయాలని ఉంది. కాని తమాయించుకుంది.

పిడుగుల వర్షం ఇంకా పడదేం? ఇంకా నిమిషం—అర నిమిషం... పది క్షణాలు.. క్షణం.. ఇంకా ఉరుములు ఉరమవేం? రామచంద్రమూర్తి ఏక్షణంలో ప్రవాహం కట్టలు తెంచుకుని తనమీద ఉరుకుతుందో నని భయపడుతున్నాడు.

ఆ అసహ్యకరమైన మాటలు నోటినుంచి ఎలా వొస్తాయి. ఛీ. ఆవిషయంగురించి తను మాట్లాడలేదు. లాభం లేదు. సుగుణ మాట్లాడే ప్రయత్నం విరమించుకుంది. మాటలరూపంలో భయటపడాలిసిన భావోద్వేగం అంతా ఆమెకళ్ళల్లోంచి బయటికి ఒస్తోంది.

ఎంతసేపటికీ సుగుణ మాట్లాడకపోవటం చూసి. మూర్తి తలెత్తి సాహసంతో ఆమెకళ్ళలోకి చూశాడు ఆమె కళ్ళార్పకుండా అలాగే చూసింది.

"దావా వొదులుకున్నారు, మా నాన్నగారు."

ఇహ సుగుణ అక్కడ నుంచోలేకపోయింది. చప్పున వెనక్కి తిరిగి పక్కగదిలోకి వెళ్ళింది.

మూర్తి కాస్త తెప్పరిలాడు. జరిగింది ఓ ఆశ్చర్యకరమైన విషయంగా అతనికి తోచింది. సుగుణ ఏమన్నా తను పడటానికి సిద్ధంగా ఉన్నాడు. కాని ఆమె తనని ఏమీ అనలేదు! ఒక్క మాటకూడా అనలేదు. కోపగించుకోలేదు. అసహ్యపడలేదు. తిరస్కారంగా చూడలేదు. జాలిగా దీనంగా ప్రాధేయపడలేదు. ఆఖరికి, "ఇంత అన్యాయం చేస్తారా?" అని అడగనైనా అడగలేదు. మూర్తి కడుపులో చెయ్యిపెట్టి పెలికినట్టయింది. అతని పరిస్థితి పూర్తిగా తారుమారయింది. "అసలు సుగుణముఖం ఎలా చూడగల" నని మొదట అనుకున్నాడు. కాని ఆమెముఖంవైపు ఇంకా చూడాలని, ఆమెకళ్లు ప్రసారంచేసే ఆ వెలుగుని చూడాలని బలీయమైన వాంఛ కలిగింది. అవ్యక్తంగా ఏదో బాధ కలిగిం దతనికి. అశాంతి, బాధ, అస్పష్టమైన ఆవేదన అతన్ని వేధించుకు తింటున్నాయి. లేచి సుగుణ గదిలోకి తొంగిచూశాడు. సుగుణ గోడవైపు తలపెట్టుకుని ఉంది. ఏం చేస్తోందో!

ఇంతలో అతనికి "దావా వొదులుకున్నారు, మా నాన్నగారు" అనే సుగుణమాటలు జ్ఞాపకం వొచ్చాయి. వెంటనే అతను ప్లీడర్ దగ్గిరికి పరిగెత్తాడు. అదివరకే అక్కడికి జగన్నాథంపంతులు వొచ్చి కూర్చునిఉన్నాడు. ఆయన్ని చూడగానే మూర్తికి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. "ఇంటిదగ్గర తప్పించుకున్న పిడుగుల వర్షం ఇక్కడ తప్పదురా, బాబూ" అనుకున్నాడు.

"కూర్చోండి మూర్తిగారూ" అన్నాడు ప్లీడర్.

మూర్తి మాట్లాడకుండా కూర్చున్నాడు. ఇహ జగన్నాథంపంతులు మొదలుపెడతాడుగావును... ఏదీ, ఇంకా వడగళ్ళవాన ప్రారంభం కాలేదేం?

అల్లుణ్ణి చూసి జగన్నాథం పంతులికి ఎన్నడూ కలగని ఏహ్యభావం కలిగింది. తలవాచేటట్లు చివాట్లు పెడదామనుకున్నాడు. కాని ఒక్కమాటకూడా నోరుపెకలి రాలేదు. "ఛీ, ఈ మూర్ఖుడితో నాకేమిటి? డబ్బుకోసం భార్యమానాన్ని బజారులో పెట్టడానికి శంకించని ఛండాలుడు" అనుకున్నాడు. అదే భావంతో దేశద్రోహిని చూసినట్టు చూశాడు అల్లుడివైపు. అదే సమయంలో మూర్తికూడా జగన్నాథం పంతులువైపు చూశాడు. ఆ చూపు! మూర్తి పంచప్రాణాలూ వొణికాయి. ఎంత అసహ్యకరమైంది ఆ చూపు! ఎంత నీచభావంతో చూస్తున్నాడు! నిజమే. తను చేసిన పనికి అలా చూడటం అసమంజసం కాదు. మూర్తి సిగ్గుతో తల వొంచుకున్నాడు. తిరస్కారంగా మరోసారి మూర్తివైపు చూసి ప్లీడర్ దగ్గిర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు జగన్నాథంపంతులు. ప్లీడర్‌తో చెప్పాలిసిందేదో చెప్పి మూర్తికూడా ఇంటిదారి పట్టాడు మరో అయిదు నిమిషాల తరవాత.

ఇంటికి రాగానే సుగుణ గది దగ్గిరికి వెళ్లాడు. లోపలనించి ఏవో మాటలు వినబడుతున్నాయి.

"భూషణం అంటే అంత తిరస్కారం మంచిది కాదు సుగుణా, మళ్లీ ఇంకోసారి చెబుతున్నాను."

కాసేపటి నిశ్శబ్దం తరవాత ఓ వెకిలి నవ్వు వినబడ్డది.

"ఆ మూర్తి నీకేం ఒరగబెట్టాడు? నా మాట విను."

మూర్తికి ఆ క్షణంలో భూషణంమీద ఎక్కడలేని అసహ్యంవేసింది. తటాలున అతను లోపలికి

పాటు వెళ్లాడు. భూషణం అతన్ని చూసి కొస్త తడ బడి పడ్డాడు.

"ఎందు కొచ్చా విక్కడికి?"

"ఆఁ...ఏదో...ఊరికే..."

"మళ్లీ ఈ గుమ్మందగ్గిర నువ్వు నాకు కనబడ కూడదు. తెలిసిందా?"

భూషణం వెకిలిగా నవ్వాడు.

"మూర్తిగారు భూషణంసంగతి మర్చి పోతు న్నారు."

ఈ హెచ్చరికవిని మూర్తికి అరికాలిమంట నెత్తి కెక్కింది.

"అందరి సంగతీ నాకు తెలుసు. మర్యాదగా బయటికి నడు."

మూర్తి కటుస్వరం విని భూషణం ఏమనుకు న్నాడో గాని మళ్లీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. వెళ్లిపోతూ ఒక మా టన్నాడు.

"భూషణం మనోరమ అన్న అనేమాట మర్చి పోకండి మూర్తిగారూ."

కోపంతో వొళ్లు మండిపోయి, "ఇద్దరూ కలిసి గంగలో దూకండి." అన్నాడు. భూషణం ఏదో సణు క్కుంటూ వెళ్లి పోయాడు.

మూర్తి సుగుణకి దగ్గిరగా వెళ్లాడు. ఎవరూ ఏమీ మాట్లాడ లేదు. ఆ నిశ్శబ్దం మూర్తికి దుస్సహంగా ఉంది. అతని హృదయంలో తుపాను చెలరేగింది. సుగుణ కోపంతో ఒక్క మాట అయినా అనిఉంటే అంత బాధపడేవాడు కాదు. కసిగాగాని, మర్మ ధ్వనితో గాని ఒక్క ఎత్తిపొడుపుమాట అయినా అని ఉంటే...! కాని సుగుణ నేలమాపులు చూస్తూ బెల్లం కొట్టినరాయిలా నుంచుంది. తనని నిందించటానికి భాషలో మాటలు లేవేమో అనుకున్నాడు మూర్తి. క్షణాలూ, నిమిషాలూ అలాగే దుర్భరంగా గడిచి పోతున్నాయి.

చివరికి సుగుణే అంది.

"నన్ను క్షమించండి. మిమ్మల్ని అవమానించ టానికి గానీ, డబ్బుకోసం గానీ దావా చెయ్యలేదు. నా దురదృష్టానికి కారణమైన డబ్బుని మీనుంచి వేరుచెయ్యాలని..."

క్షమాపణ అడగవలసింది తను. అయినా సుగుణే అడిగింది. ఈ దెబ్బతో మూర్తి పూర్తిగా కుంగిపో యాడు.

ఘోరమైన పరాజయం పొందుతున్నా డతను.

"సుగుణా, నన్ను క్షమించు" అందామని అతని ప్రయత్నం. కాని ఆ మాటలు ఎంతసేపటికీ అతని నోటి నుంచి రాలేదు.

"నన్ను ఎలాగో ఇక్కడే ఉండనియ్యండి." ఈ ఆఖరి దెబ్బకి మూర్తి ఇహ తట్టుకోలేక పోయాడు. హఠాత్తుగా సోఫాలోని పాపాయిని ఎత్తుకుని గుండె కదుముకున్నాడు. అతని గుండెల్లోని అవ్యక్తమైన బాధ ఏదో క్రమంగా జారిపోతోంది. నీళ్లు నిండిన కళ్ళతో అతడు పాపాయి కళ్లవైపు అలాగే చూశాడు. పాపాయి వేదాంతిలా నవ్వాడు.

